# పంచమి వేళ.. పద్మజన సరోవరం



**● జనసంద్రమైన తిరుచానూరు ● పటిష్ఠ భద్రతా చర్యలతో ప్రశాంతంగా పంచమితీర్థం ● ధ్వజావరోహణంతో ముగిసిన పద్మావతీదేవి బ్రహ్మోత్సవాలు**

కార్తిక మాసం శుక్లపక్ష పంచమి తిథి.. తిరుచానూరులోని పద్మసరోవరంలో అమ్మవారు ఆవిర్భవించిన రోజు. ఏటా పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో ఇదే తిథిన నిర్వహించే పంచమితీర్థంలో పుష్కరిణి స్నానమాచరిస్తే కోటిజన్మల పుణ్యఫలం చేకూరుతుందన్నది భక్తుల నమ్మకం. అందుకే మంగళవారం జరిగిన పంచమితీర్థానికి భక్తులు పోటెత్తారు. తమిళనాడు నుంచీ అధిక సంఖ్యలో భక్తులు రావడంతో తిరుచానూరు జనసంద్రమైంది. లక్ష మందికిపైగా పుష్కరిణి స్నానం చేసినట్లు అంచనా. ఇంత రద్దీకి తగ్గట్లు పటిష్ఠ ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపట్టడంతో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నిత్యకైంకర్యాల అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించారు. 8 గంటలకు సన్నిధి ముఖమండపంలో అమ్మవారికి చూర్ణాభిషేకం, ఆస్థానం జరిపారు. 9 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని, చక్రత్తాళ్వారును వేంచేపుగా పద్మసరోవరం పంచమితీర్థం మండపానికి వేంచేపు చేశారు. 10.56గంటలకు తిరుమల నుంచి శ్రీవారు పంపిన సారె ఆ మండపానికి చేరుకుంది. ఆ సారెతో అమ్మవారు, చక్రత్తాళ్వార్లకు జియ్యంగార్ల సమక్షంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుట్టిన రోజు కానుకగా అమ్మవారికి శ్రీవారు పంపిన ఆభరణాలతో, దివ్య సుగంధ తులసిమాలలతో అలంకరించారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అభిజిత్-కుంభలగ్నంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు. అప్పటికే పుష్కరిణిలో వేచిఉన్న భక్తులు 'శ్రీ పద్మావతీ పాహిమాం, గోవింద' అంటూ స్నానాలాచరించారు. రాత్రి వరకు లక్ష మందికిపైగా పుష్కరిణి స్నానాలు చేసినట్లు టీటీడీ అంచనా. పుష్కరిణిలో స్నానాల కోసం సోమవారం అర్ధరాత్రికే హోల్డింగ్ పాయింట్లు భక్తులతో నిండిపోయాయి. వారికి మంగళవారం ఉదయం అల్పాహారం, పాలు అందించారు. 10గంటల నుంచి ప్రత్యేక క్యూలైన్ల ద్వారా పుష్కరిణిలోకి అనుమతించారు. మూలమూర్తి దర్శనానికీ భక్తులు పోటెత్తారు. మంగళవారమంతా బంగారు చీరలో స్వర్ణశోభితంగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 10 గంటలకు ధ్వజావరోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

# గూడూరు.. తిరుపతిలోనే!

యథాతథంగా నగరి

వెంకటగిరి పూర్తిగా జిల్లాలోకే

34 నుంచి 37కు పెరగనున్న మండలాలు




తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లాలు, డివిజన్ల పునర్విభజనపై మంత్రుల కమిటీ సిఫారసులపై సీఎం చంద్రబాబు తుది నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో స్వల్ప మార్పులు మినహా జిల్లా యథాతథంగా కొనసాగనుంది. వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాల విలీనంతో పూర్తిగా జిల్లాలో చేరనుంది. దీంతో ప్రస్తుతం 34గా ఉన్న మండలాల సంఖ్య 37కు చేరనుంది. తద్వారా రాష్ట్రంలోని అతిపెద్ద జిల్లాల్లో ఒకటిగా తిరుపతి ఆవిర్భవించనుంది.

● గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తామని గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చినప్పటికీ అనివార్య కారణాలతో ఆ ప్రతిపాదనకు ఆమోదం లభించలేదు. దీంతో గూడూరు తిరుపతిలోనే కొనసాగనుంది. క్రిస్ సిటీ, శ్రీసిటీ, సాగరమాల రోడ్ ప్రాజెక్టులు వంటివి ఒకే జిల్లాలో ఉంటే అభివృద్ధికి అవకాశముంటుందని ప్రభుత్వం భావించడం వల్లే ఈ నిర్ణయానికి కారణమైందని తెలిసింది.

● నగరి నియోజకవర్గానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో ఉన్న నగరి, విజయపురం, నింద్ర మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేసే ప్రతిపాదనపై కసరత్తు నడిచింది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కూడా తిరుపతిలో కలపాలని ప్రభుత్వాన్ని కోరారు. చిత్తూరు జిల్లా నుంచి పుంగనూరు నియోజకవర్గాన్ని మదనపల్లె జిల్లాలో కలుపుతున్నారు. దీతో ఈ మూడు మండలాలనూ తిరుపతిలో కలిపితే ఆ జిల్లాలో మండలాల సంఖ్య, జనాభా తగ్గిపోయే అవకాశముంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆ మూడు మండలాల విలీన ప్రతిపాదనను పక్కన పెట్టినట్టు సమాచారం.

● వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రాపూరు, కలువాయి, సైదాపురం నెల్లూరు జిల్లాలోనూ, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి తిరుపతి జిల్లాలోనూ ఉన్నాయి. మంత్రుల కమిటీ చేసిన సిఫారసుల మేరకు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేసేందుకు సీఎం చంద్రబాబు ఆమోదముద్ర వేశారు.

● నెల్లూరు జిల్లా నుంచి చేరనున్న రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను గూడూరు రెవెన్యూ డివిజన్‌లో కలిపేందుకు సీఎం అంగీకరించారు. ఫలితంగా ఇప్పటి దాకా ఎనిమిది మండలాలతో కూడిన గూడూరు రెవిన్యూ డివిజన్ ఇకపై 11 మండలాలకు విస్తరించనుంది.

## ప్రాజెక్టులకు గేట్లెత్తారు



### 'అరణియార్'లో రెండు..

పిచ్చాటూరులోని అరణియార్ రిజర్వాయర్ రిజర్వాయరు నుంచి మూడోసారి రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో మంగళవారం ఉదయానికి నీటిమట్టం 30.6 అడుగులకు చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి 300 క్యూసెక్కుల నీరు చేరుతోంది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తే మరింత ఎక్కువ నీటిని విడుదల చేసే అవకాశం ఉందని జలవనరుల శాఖ డీఈ శ్రీనివాసులు తెలిపారు.

- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి

### 'మల్లిమడుగు'లో 4 గేట్లు..

రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలోని మల్లిమడుగు డ్యాం నిండడంతో 4 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. తిరుమలలోని డ్యాములు నిండడంతో మంగళవారం నీటిని కిందకు విడుదల చేశారు. దీంతో మల్లిమడుగు డ్యాంలోకి నీటి ప్రవాహం పెరగడంతో ఉదయం నుంచి 4 గేట్లను అర అంగుళం పైకి ఎత్తి వదిలారు. రెండు రోజులుగా అడపాదడపా వర్షం పడుతుండంతో మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉందని డ్యాం డీఈ చంద్రమౌళి తెలిపారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి



## రాజ్యాంగ పుస్తక ఆకృతిలో విద్యార్థులు

వెదురుకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్న ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వేడుకలకు ముందస్తుగా మంగళవారం రాజ్యాంగ దినోత్సవం పుస్తకం ఆకారంలో విద్యార్థులు కూర్చొన్నారు. రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



## భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



తిరుపతి(కలెక్టరేట్), నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, జాతీయ రహదారులు, క్రిష్ సిటీ, ఏపీఐఐసీకి సంబంధించి దుగ్గరాజుపట్నం పనులు, శ్రీసిటీలోని ఎల్జీ కంపెనీకి సంబంధించి పలు భూసంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోపు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రామ్‌మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయ్‌భరత్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆనందగిరిలో సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు



పాకాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె ఆనంద గిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో బుధవారం సుబ్ర హ్మణ్య షష్ఠి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తు న్నట్లు కమిటీ ఛైర్మన్ ఎస్. చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. ఉదయం 8-30 నుండి 11-30 గంటలవరకు స్వామివారి కల్యాణో త్సవం వైభవంగా నిర్వహిస్తామని, ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పులి వర్తి నాని దంపతులు పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం అన్నప్ర సాద వితరణ జరుగుతుందన్నారు.

**నేడు ఎమ్మెల్యే పర్యటన:** ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం మండ లంలో పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బోయపాటి నాగరా జనాయుడు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పదిపుట్లబైలు పంచా యతీ పుల్లావాండ్లపల్లెలో నిర్వహించే అన్నదాత సుఖీభవ - ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు.

## సింగిల్ విండో సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పాకాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగిల్ విండో సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో ఛైర్‌పర్సన్ క్రిష్టమ నేని సావిత్రి కోరారు. బుధవారం కావలివారిపల్లెలో సింగిల్‌విండో సభ్యు లకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘంలో రైతులు రూ.300లు చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సింగిల్ విండో ద్వారా అందిస్తున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఇంటిపై తనఖా రుణాలను పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పొందిన రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో డీసీసీబీ సూపర్‌వైజర్ ఇ.దొరస్వామి, సింగిల్‌విండో సీఈవో బి.మురళీకృష్ణ, సర్పంచ్ చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా త్రిశూలం ఊరేగింపు



దిగువవీధిలో త్రిశూలానికి పూజలు

చంద్రగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలో నిర్వ హించే గంగమ్మ జాతరను పురస్కరించుకుని మంగళవారం త్రిశూ లాన్ని ఊరేగించారు. డిసెంబరు 2, 3 తేదీల్లో చంద్రగిరి పట్టణంలోని దిగువవీధి, ఆకుతోటవీధి, జమండ్లవీధి, దాసరివీధుల్లోని నాలుగు బలుల వద్ద గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించనున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా మూడవ మంగళవారం ఉదయం మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో త్రిశూలానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనం తరం దిగువవీధిలోని గంగమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు. తర్వాత త్రిశూలాన్ని దిగువవీధి నుంచి ఆకుతోటవీధిలోని గంగమ్మ, జమండ్లవీధి లోని గంగమ్మ, దాసరివీధిలోని గంగమ్మ బలుల వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు నిర్వహించి, మిట్టమీద గంగమ్మ ఆలయానికి తీసుకొ చ్చారు. సాయంత్రం గ్రామస్తులు అంకాలమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి చంద్రగిరి పట్టణంలో డిసెం బరు 2, 3 తేదీల్లో గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు చాటింపు వేశారు. ఈకార్యక్రమంలో పినపెద్దలు పాకాల సతీష్‌రెడ్డి, విరుపాక్షి శంకర్‌రెడ్డి, మొక్కల రాజారెడ్డి, నామాల శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కరపత్రాలతో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

చంద్రగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం చంద్రగిరి పట్టణంలోని మూలస్థాన ఎల్లమ్మ గుడి వీధి, ముకుందవీధి, రెడ్డివీధి, దిగువవీధిలో అన్నదాతకు తోడుగా రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ సిబ్బంది రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రకృతి సేద్యం, అగ్రిటెక్ విధానాలతో లాభాలు, వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా ఆధునిక పద్ధతుల ద్వారా పంటకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకొంటున్న కార్యక్ర మాలను వివరించారు. ఈకార్యక్రమంలో ఏఈవో అమీర్, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు మహేశ్వర్‌రెడ్డి, హేమలత, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఈశ్వరి, కవిత, రైతులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ నూతన కార్యవర్గం



కాకర్ల జ్యోతి, శ్రీధర్‌రెడ్డి

పాకాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో మంగళవారం సాయంత్రం జరిగిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) పాకాల మండల శాఖ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షు రాలిగా కాకర్ల జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీధర్ రెడ్డి, గౌరవ అధ్యక్షు రాలిగా ఎ.వరలక్ష్మీ, అసోసియేట్ అధ్యక్షులుగా పి.సురేష్ కుమార్, వి.కు సుమ, కోశాధికారిగా ఎస్.రమేష్, కార్యదర్శులుగా ఎస్.రెడ్డమ్మ, పి.రూత్ పావని, వి.సునికర్, వి.సుధాకర్, జి.దేవి, వి.సుబ్రమణ్యంరెడ్డి, పి.శ్రీనివా సులు, జిల్లా కౌన్సిలర్లుగా వై.మదుమోహన్‌రెడ్డి, పి.తులశమ్మ, జి.రె డ్డమ్మ, మండల ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బి.నరసింహనాయుడు, సభ్యులు పి.మురళీధర్, రాయశ్రీదేవి, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా వి.వెం కటేష్, సభ్యులుగా ఎల్, ప్రమీలమ్మ, జి.సమీనాలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ పత్తిపాటి రమేష్ నాయుడు, ఎన్నికల అధి కారి ఎ.పద్మజ, పరిశీలకులు సి.సురేష్ పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆదేశాలతో ముగ్గురిపై కేసు నమోదు

పాలసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తనను ఆరు నెలలుగా వేధిస్తున్నారంటూ సువర్ణ అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శరవణకుమార్(ఆంధ్రప్రభ కంట్రిబ్యూటర్), గురు ప్రసాద్ (హ్యూమన్‌రైట్స్ మెంబరు), నవీన్‌నాయుడు(ఆర్మీ ఉద్యోగి) కలసి తనను వేధిస్తున్నారని సోమవారం చిత్తూరులో కలెక్టర్ సుమి త్‌కుమార్‌కు ఫీల్డ్ అసిస్టెంట్ సువర్ణ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

## నేత్రపర్వం..తిరుమంజనం









పుష్కరిణిలో భక్తుల సందడి

పద్మావతీ అమ్మవారికి చక్రస్నానం సందర్భంగా మంగళవారం ఉదయం పుష్కరిణిలోని పంచమీతీర్థం మండపంలో అమ్మవారు, చక్రత్తాళ్వార్లకు అశేష భక్తజనం నడుమ ఆలయ అర్చకులు జీయర్ స్వాముల పర్యవేక్షణలో స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహిం చారు. చక్రస్నానం సందర్భంగా అమ్మవారికి తిరుమల నుంచి శ్రీవారి ముత్తయిదువ సారెను పంపడం ఆనవాయితీ. తిరుమల నుంచి వచ్చిన పసుపు, చందనం, పవిత్ర వస్తువులతో అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో నేత్రప ర్వంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. స్నపన తిరుమంజనంలో అమ్మవారికి అలంకరించిన కుంకుమపువ్వు, ఫైనాపిల్, డ్రైఫ్రూట్స్, రెడ్, ఎల్లో రోజా పెటిల్స్, వట్టివేరు, తులసీమాలలు, కిరీటాలు భక్తులకు కనువిందచేశారు. ఒక టన్ను పుష్పాలతో పంచమీ తీర్థం మండపాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. - తిరుచానూరు (ఆంధ్రజ్యోతి)








తిరుచానూరు ఫ్లై ఓవర్ మీద భారీగా ట్రాఫిక్ జామ్

### ● అన్నప్రసాదాలు భేష్..



పద్మసరోవరంలో పవిత్ర స్నానాలు ఆచరించడానికి వచ్చిన లక్ష లాది మంది భక్తులకు టీటీడీ అన్నప్రసాదాలను అందజేసింది. తిరుచానూరులోని తోలప్ప గార్డెన్స్, జిల్లా పరిషత్ హైస్కూలు, పుసుపు మండపం, మార్కెట్ యార్డుతో పాటు హోల్డింగ్ పాయిం ట్లలో సుమారు 1.50లక్షల మందికి అల్పాహారంతో పాటు అన్నప్ర సాదాలు అందజేశారు. బాదంపాలు, బిస్కెట్లు, కదంబం, దధ్యో జనం, చక్కెల పొంగలి, పులిహోర, అందచేశారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. దీంతో పాటు రెండు లక్షల వాటర్ ప్యాకెట్లు అందజేశారు. టీటీడీ ఉన్నతాధికారులు అన్నప్ర సాద వితరణను పరిశీలించారు. టీటీడీతో పాటు తిరుచానూరు గ్రామంలో పెద్దఎత్తున గ్రామస్తులు కూడా అన్నదానం చేశారు.

## పళ్లికొండేశ్వరాలయంలో తరచూ కనిపించని అర్చకులు!

### భక్తులకు లభించని వాల్మీకేశ్వరస్వామి సమేత మరగదాంబిక, దక్షిణామూర్తుల హారతి







పూజారులు లేక ఖాళీగా వాల్మీకేశ్వర, మరగదాంబిక, దక్షిణామూర్తి సన్నిధులు

నాగలాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయంలో అర్చకులు అప్పుడప్పుడు కనిపించ కుండా పోతున్నారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులకు హారతి కరువవుతోంది. జిల్లాలోని ప్రముఖ శివాలయాల్లో పళ్లికొండేశ్వర ఆలయం ఒకటి. ఈ ఆలయం ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రా లకు సరిహద్దులో ఉండడంతో వందల మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. ఈ ఆల యంలో పళ్లికొండేశ్వరుడి సన్నిధి సహా మూల స్థానం సన్నిధిలో మరగదాంబిక, వాల్మీకేశ్వరుడి, దాంపత్య దక్షిణామూర్తి సన్నిధులున్నాయి. ఆల యంలో ఆరుగురు అర్చకులు ఉన్నారు. ఇం దులో పళ్లికొండేశ్వరుడి సన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకుడు ఉంటారు. మిగిలిన మూడు సన్నిధుల్లో ముగ్గురు, మరో ఇద్దరు రోజువారి వేతనాల కింద అర్చకత్వం నిర్వహిస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా ఉదయం వేళలో ఈ సన్నిధానాల్లో అర్చకులు ఏదో ఒక సాకుతో బయటికి వెళ్లిపోతున్నారు. ఒక్కోసారి ఈ మూడు సన్నిధానాలకు ఒకే ఒక్క అర్చకుడు మాత్రమే ఉంటున్నారు. దీంతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు కనీస హారతి కరువైపోతోంది. ఒకరిద్దరు అర్చకులైతే... విధుల్లో ఉన్నా భక్తులకు హారతి కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆలయ ఈవో లతని వివరణ కోరగా... అర్చకులతో సమావేశం నిర్వహించి దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కాణిపాక ఆలయ ఈవో పదవీ కాలం పెంపు



కిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈవో పెంచలకిషోర్ పదకీ కాలాన్ని మరో ఏడాది పెంచారు. ఆయన రెవెన్యూ శాఖ నుంచి దేవదాయ శాఖకు డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. వచ్చే నెల 6 వరకు ఈవోగా కొనసాగేందుకు వ్యవధి ఉంది. ఈక్రమంలో మరో ఏడాది కాలపరిమితి పెంచారు.

## ఇలా చేస్తే పీఎం కిసాన్ లబ్ధి

వెదురుకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం కిసాన్ పథకం కింద కొందరు తమ ఖాతాల్లో నగదు జమ కాలేదని ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వారు తమకు ఆర్థిక సాయం జమ కాకపోవ డానికి కారణాలు తెలుసుకుని సరిదిద్దుకుంటే తిరిగి లబ్ధి చేకూరుతుం దని అధికారులు సూచిస్తున్నారు.

● కొందరు రైతులు పీఎం కిసాన్ ఈకేవైసీ పూర్తి చేసుకోలేదు. వారు ఇప్పుడైనా ఈకేవైసీపీ పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అవ కాశం కల్పించింది. మీ సేవా కేంద్రాలు లేదా కామన్ సర్వీస్ సెంటర్స్(సీఎస్‌సీ)లలో వేలిముద్ర లేదా ఐరిష్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తి చేసుకో వచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన 30 నుంచి 60 రోజుల్లో ఎన్‌పీసీఐ లింక్ ఉన్న బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి.

● రైతు ఆధార్‌కి పట్టాదారు పాసుబుక్ లింక్ కాకపోయినా పథకం కింద లబ్ధి చేకూరదు. గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ దగ్గర పట్టాదారు పాసుపుస కానికి సంబంధించిన ఆధార్ లింక్ అప్లికే షన్ పూర్తి చేయాలి. వేలిముద్ర లేదా ఓటీపీతో లింక్ అభ్యర్థనను వారు తహసీల్దార్ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడ పూర్తయిన తరువాత గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఈవిషయం తెలియజే యాలి. వారు మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా కార్యాలయానికి రైతు వివరాలను పంపిస్తారు.

● రైతు బ్యాంకు ఖాతా ఆధార్‌తో అనుసంధానం కాకపోయినా ఆర్థిక సాయం జమకాదు. రైతు చివరగా తెరిచిన బ్యాంకులో ఎన్‌పీ సీఐ లింకు చేయించాలి. లేదా ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకులో కొత్త ఖాతాను ఓపెన్ చేస్తే ఎన్‌పీసీఐ లింక్ అవుతుంది. రైతుకు ఎన్‌పీ సీఐ లింక్ అయినప్పటి నుంచి 30 రోజుల నుంచి 90 రోజుల వ్యవధిలో పథకం కింద నగదు జమ అవుతుంది.

● 2019 ఫిబ్రవరి తరువాత భూమి మ్యూటేషన్ జరిగిన వాటికి పీఎం కిసాన్ వర్తించదు. భార్యాభర్తల్లో ఒకరు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతూ మరణిస్తే నామిని తన పేరిట రికార్డులో తన పేరు మార్చుకుని దరఖాస్తు చేస్తే అర్హత పొందవచ్చు. ఈ సంవత్సరం మొదటి విడతలో కూడా కొందరికి నగదు జమ కాలేదు. ఒకే కుటుం బంలో ఇద్దరు లబ్ధిదారులు ఉన్నారనే అనుమానంతో ఇలా జరిగింది. ఫీల్డ్ వెరిఫికేషన్ తరువాత వారికి నగదు జమ అవుతుందని అధికా రులు చెబుతున్నారు.

● పీఎం కిసాన్ పథకానికి కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షన్‌దారులు, ఆదాయ పన్ను చెల్లించేవారు. రాజ్యాంగ పద వుల్లో ఉన్న వారు అనర్హులని గుర్తించాలి.

## పంటలపై కొనసాగుతున్న గజదాడులు





బోరు మోటరు, పైపులను ధ్వంసం చేసిన ఏనుగు - గజదాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగుతూనే ఉన్నారు. మండలంలోని దేవళం పేట పంచాయతీలో సోమవారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు దేవళంపేట పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి నాయనిచెరువు మార్గంలో పెనుబాలవారిపల్లి వద్దకు చేరుకొని పలు పంటలను, పైపులను నాశనం చేసింది. చిన్ననగరిలోని మామిడి తోటల్లోని కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకుంది. మంగళవారం పగలంతా సూరప్పచెరువు వద్ద ఒంటరి ఏనుగు సంచరించినట్లు ప్రజలు తెలిపారు.

## తేనెటీగల దాడిలో హౌసింగ్ అధికారులకు గాయాలు

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తేనెటీగలు దాడి చేయడంతో హౌసింగ్ అధికారులు గాయపడిన ఘటన కోట మండలం కొండు గుంట వద్ద మంగళవారం జరిగింది. హౌసింగ్ డీఈ షబ్బీర్, ఏఈ భాస్కర్‌రావు లేఅవుట్‌లను పరిశీలించేందుకు కొండుగుంట నర్సరీ వద్దకు వెళ్లారు. అక్కడ స్థల పరిశీలన చేస్తుండగా కొండ తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో అధికారులు పరుగులు తీశారు. తీవ్రంగా గాయపడిన అధికారులను స్థానికులు చిట్టేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తీసుకెళ్లారు.

## బైక్ ఢీకొని వలస కూలీ మృతి

వాకాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొనడంతో వలస కూలీ మృతి చెందిన ఘటనల మండలంలోని సిద్ధిగుంటపాళెం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఫజిల్‌పూర్ నివాసి దులాల్ సర్దార్(65) వరినాట్లు వేసేందుకు నెల రోజులక్రితం నుంచి సిద్ధిగుంటపాళెం గ్రామానికి వచ్చాడు. అక్కడే ఓ గోదాములో అద్దెకుంటూ కూలి పనులకు వెళ్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకొని వస్తుండగా బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన దులాల్ సర్దార్ అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగబాబు తెలిపారు.

## వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు నెంబరు ప్లేటు లేని ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన మంగళవారం రాత్రి సూళ్లూరుపేట పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సూళ్లూరు బొగ్గుల కాలనీకి చెందిన మన్నారు మంగమ్మ బాహుజీ కాలనీలో ఉన్న తన కుమార్తె ఇంటికెళ్లి తిరిగి వస్తుండగా విద్యుత్‌శాఖ ఈఆర్ కార్యాలయం వద్ద ఇద్దరు యువకులు మోటారు సైకిల్ వేగంగా వచ్చి మంగమ్మ మెడలోని 3 సవర్ల బంగారు గొలుసు లాక్కొని వెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే స్పందించి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. నమోదు దర్యాప్తు చేపట్టారు.

## కమ్మగుట్టపల్లె అడవిలో పులి సంచారం

పూతలపట్టు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం కమ్మ గుట్టపల్లె సమీపానగల అడవిలో పులి సంచరిస్తోందన్న సమాచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కమ్మగుట్టపల్లె గ్రామ సమీపాన కమ్మగుట్ట అటవీ ప్రాంతం ఉంది. మంగళవారం చేపలు పట్టేందుకు వెళ్లిన కొంతమంది అడవిలో సంచరిస్తున్న పులిని చూసి పరుగులు తీశారు. ఈ విషయం పరిసర ప్రాంతాల ప్రజలకు తెలియడంతో భయాందోళనకు గుర వుతున్నారు.

## 40 వేల రైతు కుటుంబాలకు సీఎం చంద్రబాబు లేఖలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతన్నా మీ కోసం కార్య క్రమంలో భాగంగా రెండో రోజైన మంగళవారం జిల్లావ్యాప్తంగా 40,548 మంది రైతు కుటుంబాలకు సీఎం లేఖలను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 313 రైతు సేవా కేంద్రాల పరిధిలో మొదలైన రైతన్నా మీ కోసం కార్యక్ర మాల్లో చిత్తూరు మండలం పాలూరు క్లస్టర్‌లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహ న్, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన శాఖాధికారి మధు సూదన రెడ్డి, మార్కెటింగ్ కార్యదర్శి ఇందుమతి పాల్గొన్నారు.పాలస ముద్రం మండలం రామలింగాపురం,రేణుకాపురం, జీడీ నెల్లూరులోని వేపం జేరిలో పశుసంవర్ధక శాఖాధికారి ఉమామహేశ్వరి పాల్గొన్నారు.వెదురు కుప్పం మండలంలోని చెంచుగూడి, తిరుమలయ్యగారిపల్లి, ఎస్ఆర్‌పురం మండలంలోని పిల్లారికుప్పంలో జిల్లా పటుపరిశ్రమాధికారి సుజాతమ్మ పాల్గొన్నారు. బంగారుపాళ్యంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడీ రవికుమార్ పాల్గొన్నారు.

## స్మార్ట్ కార్డు తీసుకున్నారా?

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం స్మార్ట్ కార్డులను మూడు నెలల కిందట అందుబాటులోకి తెచ్చింది.32 మండలాల్లో పంపిణీ కోసం 5, 27, 680 కార్డులు చిత్తూరు జిల్లాకు చేరగా వీటి పంపిణీ బాధ్యతను రేషన్ డీలర్లకు, గ్రామ సచివా లయ సిబ్బందికి అప్పగించారు. వీటిలో ఇంకా 37, 634 కార్డులు మిగిలిపోయాయి. ఆయా కార్డుదారులు ఉన్నారా లేదా అని అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ నెల 30 తరువాత వాటిని తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరచాలని అధికారులు ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో గృహాల మ్యాపింగ్ ప్రక్రియ సక్రమంగా జరక్కపోవడంతో ఒక ప్రాంతంలో వారికి మరోప్రాం తంలోని చౌకదుకాణాల్లో కార్డులు ఉండటంతో స్మార్ట్‌కా ర్డుల పంపిణీ గందరగోళంగా మారింది. తమ కార్డులు ఎక్కడున్నాయో తెలియక వేలాదిమంది ఎదురు చూస్తున్నారు.

● **ఇవీ ప్రధాన ఇబ్బందులు..**

16, 94, 463 యూనిట్లలో 75, 606 మంది ఈకేవైసీకి దూరంగా ఉన్నారు. ఈకేవైసీ ప్రక్రియ నత్తన డకన కొనసాగడమే ఇందుకు కారణం. చాలా మంది లబ్ధిదారులకు కార్డులు ఎక్కడిస్తారో తెలియక చౌకదుకా ణాలు,సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరో వైపు లబ్దిదారుల వివరాలు సరిగా తె లియక చాలా కార్డులు డీలర్లు, సచివాలయాల వద్దే మిగిలిపోయాయి. మరో వైపు ఈకేవైసీ ప్రక్రియ పూర్తికాకపోవడంతో కార్డుల్లో మృతుల వివరాలు, వివాహమై అత్తారింటికి వెళ్లిన వారి పేర్లు అలాగే కొనసాగుతున్నాయి.

● **వెనుకబడ్డ పెనుమూరు**

మొత్తం 5, 27, 680 స్మార్ట్ కార్డుల్లో ఇంతవరకూ 1, 59, 427కార్డులు సచివాలయాల ద్వారా, 3, 30, 619 కార్డులు చౌకదుకాణాల ద్వారా పంపిణీ అయ్యాయి. 37,634 కార్డులు పంపిణీకి నోచుకోలేదు.96.64 శాతం పంపిణీతో నగరి మండలం ముందుండగా 87.54శాతంతో పెనుమూరు చివర్లో వుంది. గంగ

### 30వ తేది వరకే అవకాశం



వరంలో 95.05శాతం, గుడుపల్లెలో 95.92, పెద్దపంజాణిలో 95.16, రొంపిచెర్లలో 95.96, తవణం పల్లెలో 95.27,యాదమరిలో 95.53,విజయపురంలో 95.64,పుంగనూరులో 88.19, రామకుప్పంలో 89.88 శాతం కార్డుల పంపిణీ జరిగింది.

## తాతయ్యగుంట గంగమ్మకు రూ.6లక్షల విరాళం



మహేష్‌యాదవ్‌కు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే, ఆర్యవైశ్యసంఘ ప్రతినిధులు

తిరుపతిఅర్బన్ / తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి ఆర్యవైశ్యసంఘ ఆధ్వర్యంలో మంగళవారం రూ.6,01,116 విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో సంఘ అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, నేతలు కలసి ఆలయ చైర్మన్ మహేష్‌యాదవ్‌కు చెక్కుని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయ విస్తరణకు అవసరమైన స్థలం కొనుగోలు కోసం ఆర్యవైశ్యులు విరాళాన్ని అందించడం సంతోషంగా ఉందని అభినందించారు. నరసింహులు మాట్లాడుతూ.. గతంలో అమ్మవారి ఆలయ కుంభాభిషేక సమయంలో శిఖరాన్ని బంగారుతాపడం చేసే అదృష్టం తమ సంఘానికి కలిగిందని, వాసవీమాత ఆశీస్సులతో భవిష్యత్‌లోనూ గంగమ్మ ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. జనసేన నాయకులు రాజారెడ్డి, సంఘనేతలు సుకుమార్, రమేష్, శ్రీరాములు, సురేష్, మధుసూదన్, రామ్మూర్తి, రమేష్, సందీప్, చంద్రశేఖర్, సుష్మ, శేఖర్, శ్రీదేవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాటన్ మిల్లు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న కాటన్‌మిల్లు ఉద్యోగులు

తిరుపతి(జీవకోన), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి కాటన్‌మిల్లు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీ గురుమూర్తిని ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ మిల్లు మూతపడిన అనంతరం తమకు రావాల్సిన జీతాలు, పీఎఫ్, గ్రాట్యూటీ వంటి బకాయిలు ఇంత వరకు చెల్లించలేదని, దీంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించి మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ తెలిపారు. ఉద్యోగులకు న్యాయం జరిగేలా తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు పలువురి శుభాకాంక్షలు



ఆర్కాట్ కృష్ణ ప్రసాద్‌ను సత్కరించిన జనసేన నాయకులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక అనంత వీధిలోని ఆర్కాట్ కృష్ణప్రసాద్ కార్యాలయంలో మంగళవారం పలువురు జనసేన నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నగరంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు,అభిమానులు, స్నేహితులు కృష్ణప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో 36వ వార్డు కూటమి నాయకులు సుబ్బుయాదవ్, ఆముదాల వెంకటేష్, వినోద్‌రాయల్, శంకర్ యాదవ్, ఆర్టీసీ నాయకులు ఆర్.చంద్ర, వి.మస్తాన్, మురగమ్మ, గోపీనాథ్ నాయుడు, బెల్లంకొండ సురేష్, సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత రక్త పరీక్షలు



విద్యార్థినులకు ఉచిత మందులు అందజేస్తున్న వే ఫౌండేషన్ నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో సంబోధిని ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి పెట్లూరి హరిప్రసాద్ మాట్లాడుతూ.. సంబోధిని ద్వారా వేలాది మందికి రక్త పరీక్షలు చేపట్టామన్నారు. వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య, ప్రిన్సిపాల్ లత, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి



మల్లైయన్ (ఫైల్ ఫొటో)

సత్యవేడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. మండలంలోని శిరుణంబూదూరు గ్రామానికి చెందిన మల్లైయన్(38) ఉదయం 11 గంటల సమయంలో ఇనుప గ్రిల్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంట్లో విద్యుత్ వైర్లు ఇనుప గ్రిల్ మీదుగా వెళ్తుండడం, ఆ రాపిడికి వైరుపైనున్న పూత కరిగి లోపలున్న తీగలు గ్రిల్‌కు తగడంతో విద్యుత్ సరఫరా అయ్యి ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించడంతో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

వరదయ్యపాళెం, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీసిటీ డీఎస్పీ బి.వి.శ్రీనివాసులు హెచ్చరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో శ్రీసిటీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌ఐ పి.అరుణ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో 3 డ్రంకెన్ డ్రైవ్ విత్ ఎఫ్ఐఆర్, 8 డ్రంకెన్ డ్రైవ్, 25 బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన నిందితులను మంగళవారం సత్యవేడు జడ్జి ముందు హాజరు పరిచారు. ఈ కేసులో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి తలా రూ.10 వేలు, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ పట్టుబడిన వారికి తలా రూ. వెయ్యి జరిమానా సత్యవేడు జడ్జి విధించి నట్లు తెలిపారు.

## టీబీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకుల పంపిణీ

రేణిగుంట నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులను జిల్లా వైద్య అధికారి బాలకృష్ణ నాయక్ అందజేశారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు బియ్యం, తదితర నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ చక్రపాణి, టీబీ సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్ఎస్‌లో మాక్ డ్రిల్

రేణిగుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తూ క్యారేజ్ రిపేర్ షాప్‌లో ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం సీఆర్ఎస్‌లో చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ శ్రీనివాస్, డిప్యూటీ సీఎంఈ ప్రమోద్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సమయంలో అనుకోని ప్రమాదం జరిగినప్పుడు చేపట్టాల్సిన ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించారు. సేఫ్టీ ఆఫీసర్ హిమసాగర్, సీఆర్ఎస్ అధికారులు సివిల్ డిఫెన్స్ టీం, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

# తిరుపతి

## సంస్కృత వర్సిటీ వీసీకి శారదా పీఠాధిపతి ఆశీస్సులు



విధుశేఖర భారతి ఆశీస్సులు పొందుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ వేద సంగోష్ఠికి విచ్చేసిన శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతి సంస్కృత యూనివర్సిటీ వీసీ కృష్ణమూర్తికి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ తరఫున స్వామి వారికి జ్ఞాపిక అందజేశారు.

## 28న ఉపనిషద్వింశతి గ్రంథావిష్కరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ శర్మ రాసిన ఉపనిషద్వింశతి గ్రంథావిష్కరణ కార్యక్రమం ఈ నెల 28వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎస్వీ ఓరియెంటల్ కాలేజీలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. దీనికి ఈ తరం కవితా వేదిక తోడ్పాటును అందిస్తుంది. ఇందులో సాహిత్యవేత్తలు తోట వెంకటేశ్వర్లు, సీతారామారావు, నారాయణస్వామిరెడ్డి, తమ్మినేని బాబు, మన్నవ గంగాధరప్రసాద్ తదితరులు పాల్గొంటారు.

## వెటరన్ జర్నలిస్టులకు శాశ్వత అక్రిడిటేషన్లు ఇవ్వాలి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వెటరన్ జర్నలిస్టులకు శాశ్వత అక్రిడిటేషన్లు ప్రభుత్వం మంజూరు చేయాలని వెటరన్ జర్నలిస్టుల సంఘం జిల్లా శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జనార్దన్ డిమాండ్ చేశారు. తిరుపతిలో మంగళవారం జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో వెటరన్ జర్నలిస్టులకు పంపిణీ చేస్తున్న విధంగా నెలకు రూ.20వేల పింఛను మంజూరు చేయాలని కోరారు. మెడిక్లెయిమ్‌ను రూ.5లక్షలకు పెంచాలని కోరారు. అనంతరం 9మందితో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడిగా శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టి.జనార్దన్, అధ్యక్షుడిగా ఎం.నరేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.చంద్రశేఖర్, కోశాధికారిగా ఎస్.వరదరాజులు, ఉపాధ్యక్షుడిగా పి.వి.రవికుమార్, సహాయ కార్యదర్శిగా ఎం.సుబ్రమణ్యంరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎస్.రమేష్‌కుమార్, రాఘవ శర్మ ఎన్నికయ్యారు.

## నేడు ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ తిరుపతి రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలానీ తిరుపతికి రానున్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి ఎన్‌సీసీ గ్రూపును సందర్శించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

### ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను

# త్వరగా పరిష్కరించండి: కమిషనర్



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తుల పరిష్కారం, తదితర అంశాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో మంగళవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు, లే అవుట్లు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ద్వారా ప్రజలకు అవకాశం కల్పించిందని తెలిపారు. ఇందుకోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్లను, ఫుట్‌పాత్‌లు ఆక్రమించకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ప్లాన్ ప్రకారం కాకుండా డీవియేషన్ చేసి చేపడుతున్న భవన నిర్మాణాలను ప్రాథమిక దశలోనే అడ్డుకోవాలని ఆదేశించారు. అనధికారిక ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. పెండింగ్ ఉన్న ప్రకటనల పన్నులు వసూలు చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలను కోరారు. ఈ సమావేశంలో ఏసీపీలు మూర్తి, మధు, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువారెడ్డి, మేనేజర్ హసిమ్, టీపీఎస్ వంశి, టీపీబీవోలు, ప్లానింగ్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

● నేడు కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల ధర్నా



కార్మిక సంఘాల ధర్నా సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశంలో కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌ల ఆర్డినెన్స్‌ను, మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని బుధవారం తిరుపతి కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని చంద్రశేఖరరెడ్డి(ఏఐటీయూసీ), ఎస్.జయచంద్ర (సీఐటీయూ), కె.విజయకుమార్(ఐఎఫ్‌టీయూ), రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు డిమాండ్ చేశారు. తిరుపతి ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ధర్నా సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళనలు చేపట్టాలన్నారు. అన్ని సంఘాల నాయకులు ఆయా సంఘాల సభ్యులను ధర్నాకు తీసుకురావాలన్నారు. లేబర్ కోడ్ల ఆర్డినెన్స్‌ల ఉపసంహరణ, వ్యవసాయ చట్టాల రద్దు, 8 గంటల పనివిధానం అమలుచేసే వరకు ఐక్యమత్యంతో నిరంతరంగా ఆందోళనలు చేయాలని, అందుకు ప్రణాళికలు రూపొందించాలని తీర్మానించామన్నారు. బుధవారం చేపట్టే ధర్నా పాలకులకు గుణపాఠం కలిగేవిధంగా ఉండాలన్నారు. సమావేశంలో మూడు కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రోస్టర్ ప్రకారం పదోన్నతులు, నియామకాలు చేపట్టాలి



సీఎండీని సత్కరిస్తున్న విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కంలో ఖాళీగా వున్న సబ్ ఇంజనీర్లకు రిజర్వేషన్ రోస్టర్ మేరకు పదోన్నతులు కల్పించాలని, షిఫ్ట్ ఆపరేటర్ల నియామకాల్లో రోస్టర్ పాటించాలని సీఎండీ లోతేటి శివశంకర్‌ను బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. మంగళవారం కార్పొరేట్ కార్యాలయంలో వారు సీఎండీని మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సీఎండీని కలసినవారిలో నాయకులు పి.వి.మురళి, ఎల్.చలపతి, కరీముల్లాఖాన్, సి.వి.వేణు ఉన్నారు.

### రుయాస్పత్రిలో రోగులకు

# మెరుగైన వైద్యసేవలు అందించాలి

తిరుపతి(వైద్యం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోనే గుర్తింపు పొందిన రుయాస్పత్రిలో రోగులకు అన్ని మౌలిక వసతులతో కూడిన మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. రోగుల సమస్యలను పరిష్కరించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలంటూ ఆయన మంగళవారం రుయాస్పత్రి ముందు సీపీఐ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రుయాస్పత్రిలో రోగులకు సరిపడ పడకలు, అవసరమైన వైద్య పరికరాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం అత్యవసర వైద్యం కూడా సక్రమంగా అందని స్థితిలో ఉందన్నారు. రోగులకు పూర్తిస్థాయిలో మందులు కూడా ఇవ్వడం లేదన్నారు. వెంటనే జిల్లా అధికారులు రుయాస్పత్రిపై దృష్టి సారించి రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు. చలపతి, మంజుల, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతీ దేవి పసుపు, కుంకుమకు నీరాజనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచమీతీర్థం సందర్భంగా తిరుచానూరు పద్మావతీ అమ్మవారికి టీటీడీ సమర్పించనున్న పసుపు, కుంకుమలకు రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి స్వాగతం పలికారు. అమ్మవారి ఆభరణాలు, పట్టు వస్త్రాలు, ఫల, పుష్పాలకు స్థానిక బండ్లవీధిలో గల ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆయన స్వాగతం పలికారు. అమ్మవారి ఆశీస్సులు భక్తులకు కలకాలం ఉండాలని ఆకాంక్షించారు.

# నింగి నుంచీ పర్యవేక్షణ

● సీసీ కెమెరాలతో నిఘా
● పంచమితీర్థం బందోబస్తులో పోలీసుల అప్రమత్తత



పుష్కరిణి వద్ద బైనాక్యులర్ ద్వారా పర్యవేక్షిస్తున్న ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి పంచమితీర్థం సందర్భంగా మంగళవారం పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. డ్రోన్ కెమెరాల ద్వారా పైనుంచీ నిఘా పెట్టారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తూ.. జనం రద్దీ ఉన్నచోట సిబ్బందిని అప్రమత్తం చేస్తూ.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. హోల్డింగ్ పాయింట్ల నుంచి పుష్కరిణి వరకు ఎటువంటి అంతరాయం లేకుండా ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు తీసుకున్నారు. టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు సమన్వయంతో భద్రతా చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లు, ప్రవేశద్వారాలు, హోల్డింగ్ ఏరియాలు, పుష్కరిణి చుట్టూ ప్రత్యేక కమాండ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు నియంత్రిస్తూ వచ్చారు. మ్యానుప్యాక్ కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ మార్గదర్శకాలను అందించారు. ట్రాఫిక్ పోలీసులు రాకపోకలను మళ్లిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూశారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేక మహిళా పోలీస్ బృందాలు, మెడికల్ టీమ్‌లు, అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, నాగభూషణం, ఐ.రామకృష్ణ (తిరుమల) శ్రీనివాసులు, కులశేఖర్, శ్రీనివాసులు (ఏఆర్), డీఎస్పీలు ప్రసాద్ (చంద్రగిరి), భక్తవత్సలం (తిరుపతి), చంద్రశేఖర్ (ఏఆర్), సీఐ సునీల్, ఎస్ఐ సాయినాథ్, టీటీడీ విజిలెన్సు సిబ్బంది సమన్వయంతో ముఖ్య పాత్ర పోషించడంతో పంచమితీర్థం ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ సుబ్బరాయుడు వారిని అభినందించారు.



### స్వర్ణముఖి వద్ద గుట్టలుగా పేరుకుపోయిన

# చెత్త, నిర్మాణవ్యర్థాలు..!

● కుళ్లిన చెత్త, ప్లాస్టిక్‌ను ఆహారంగా తింటున్న జీవాలు, పందులు ● భరించలేని దుర్వాసనతో వాహనదారులకు తప్పనితిప్పలు





స్వర్ణముఖినది కాలువను ఆనుకుని పడేసిన వ్యర్థాల్లో సంచరిస్తున్న పందులు - రహదారి పొడువునా గుట్టలుగా పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలు

తిరుపతి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లెకి వెళ్లే మార్గంలో స్వర్ణముఖినది కాలువను ఆనుకుని ఉన్న ఒడ్డుపై, రహదారి పక్కనే చెత్త, ప్లాస్టిక్, భవన నిర్మాణ, విద్యుత్ వ్యర్థాలను పడేస్తున్నారు. రహదారి పొడవునా పడేసిన ఈవ్యర్థాలు గుట్టలు.. గుట్టలుగా పేరుకుపోయాయి. దీనిలోని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ వ్యర్థాలలోనే నిత్యం మూగ జీవాలు, పందులు సంచరిస్తూ వాటిని ఆహారంగా తీసుకుంటున్నాయి. ఈమార్గంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు నిత్యం వాహనాలపై నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడికి వచ్చేసరికి ఈ దుర్వాసన భరించలేక ముక్కులు మూసుకుని వెళ్తున్నారు. వర్షాలకు ఈ వ్యర్థాలు కరిగి నదిలోకి చేరుతున్నాయని, ఇళ్ల నుంచి సేకరించిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది వాహనాల్లో తరలించి పడేసి వెళ్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కాగా ఓ పక్క ప్రభుత్వ పాలకులు గ్రామాల్లో స్వచ్ఛత కోసం పలు అవగాహనా కార్యక్రమాలు చేపడుతుంటే.. మరోపక్క కొందరు దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తుండడం సరికాదంటున్నారు. ఈదిశగా అధికారులు దృష్టిసారించి వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## కాణిపాక ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం నేడు

ఐరాల(కాణిపాకం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు. ఆలయ ఉభయదారులు, స్థానికులు, స్వామి భక్తులు విజయవంతం చేయాలని ఈవో కోరారు.



## తాటిగేగులు వచ్చేశాయ్!

పండగ నెలలో సందడిచేసే గేగులు అప్పుడే కనిపిస్తున్నాయి. బజార్లలో బుట్టల్లో పెట్టుకుని అమ్ముతున్నారు. తాటిముట్టి మొలకెత్తడానికి ముందు దశే ఇది. తేగలనీ, గేగులనీ పిలుస్తారు. దీన్ని రెండు పాయలుగా చీలిస్తే మధ్యలో ఉండే దబ్బలాంటి తెల్లటిదాన్ని చందమామ అంటారు. దీని కొన మెత్తగా రుచిగా ఉంటుంది. గేగు తొక్క తీసేసి తింటే మొత్తం పిండిపదార్థామే. పీచు ఎక్కువగా ఉండే ఆహారం కావడం వల్ల జీర్ణక్రియకు బాగా దోహదపడుతుంది. తాటి చెట్ల నుంచి రాలిన పండ్లు చీకిపోయి ముట్టెలు తేలుతాయి. వీటిని ఏరి మెత్తని మట్టిలో కప్పిపెడితే మూడు నెలలకు తేగలు తయారవుతాయి. వీటిని తవ్వితీసి కాల్చుకునిగానీ ఉడకబెట్టుకుని గానీ తింటారు. సహజసిద్ధమైన ప్రకృతి ఆహారం ఇది. ఇప్పటికీ ప్రభుత్వ బడుల ముందు ఈ సీజన్‌లో అమ్ముతూ ఉంటారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

## 10న స్థానికులకు వైకుంఠద్వార దర్శనాల టోకెన్ల విడుదల

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శనాలు జరిగే చివరి మూడురోజులు స్థానికులకు దర్శన అవకాశం కల్పించనున్నారు. జనవరి 6, 7, 8 తేదీలకు సంబంధించిన టోకెన్లను డిసెంబరు 10వ తేదీ ఉదయం 10 గంటలకు వన్ ప్లస్ త్రీ విధానంలో కేటాయించనున్నారు. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు రూ.4,500, తిరుమల స్థానికులకు 500 చొప్పున రోజుకు 5 వేల టోకెన్లు జారీ చేయనున్నారు. దీని కోసం కూడా ప్రత్యేక యాప్‌ను రూపొందించనున్నారు. ఇక, టీటీడీ ఉద్యోగులకు కూడా దర్శన విధివిధానాలను రూపొందించారు.

## సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని ఓ షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.23 కోట్లు**

**సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,615**

**తలనీలాలు సమర్పించినవారు: 27,722**






మాడవీధుల్లో భక్తజనం - హోల్డింగ్ పాయింట్ నుంచి క్యూలో పుష్కరిణిలోకి..

# తిరుచానూరు దిగ్బంధం

- వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల ఘటనతో అధికారుల అప్రమత్తం
- పంచమి తీర్థానికి పటిష్ట చర్యలు

తిరుచానూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ ప్రక్రియలో తిరుపతి నగరం బైరాగిపట్టెడ వద్ద తొక్కిసలాట నేపథ్యంలో అధికారులు పంచమితీర్థానికి అప్రమత్తమయ్యారు. పోలీసు, టీటీడీ ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారులే ఒకటికి నాలుగుసార్లు అమ్మవారి పుష్కరిణి, ఆలయ మాడవీధులు, పార్కింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పర్యటించారు. తిరుచానూరు గ్రామాన్ని అష్టదిగ్బంధం చేశారు సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు తిరుచానూరులోకి వాహనాలను అనుమతించకుండా గ్రామ ముఖద్వారాల పోలీసు పికెట్లు ఏర్పాటుచేశారు. గ్రామంలోకి ప్రవేశించిన ప్రతి భక్తుడిని సోమవారం రాత్రి నుంచే హోల్డింగ్ పాయింట్లకు పంపారు. మంగళవారం ఉదయం 11గంటల వరకూ వచ్చిన ప్రతి ఒక్కరినీ షెడ్లకు పంపి.. విడతలవారీగా ప్రత్యేక క్యూలైన్ల ద్వారా పుష్కరిణిలోకి అనుమతించారు. టీటీడీ ఉద్యోగులు, ఇతర శాఖ ఉద్యోగులు ఎక్కడికక్కడ మీడియాను కూడా నిరోధించి 10గంటల తర్వాత పుష్కరిణిలోకి పంపారు. ఇలా ఎక్కడికక్కడ పటిష్ట చర్యలు తీసుకోవడంతో తొక్కిసలాట లేకుండా పుష్కరిణిలో భక్తులు స్నానాలాచరించారు. చిన్న చిన్న తోపులాటలు మినహాయించి ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పంచమితీర్థం ముగిసింది. దీంతో వేలాది మంది భక్తులు తరలివచ్చినా ప్రశాంత వాతావరణంలో పుణ్యస్నానాలు ఆచరించి తిరుగు పయనమయ్యారు. ఇక, సుపథం మహాద్వారం వద్ద పెద్దసంఖ్యలో భక్తులు గుమికూడటంతో తోపులాట జరిగింది. భక్తులు కాస్త ఇబ్బందిపడ్డారు. పద్మావతి అమ్మవారి దర్శనానికి రాత్రి పొద్దుపోయే వరకూ భక్తులు బారులు తీరారు. వేలాది మంది తరలి వచ్చి పద్మసరోవరలో పుష్కర స్నానాలుచేశారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కలిసి జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులను అభినందించారు.



పుష్కరిణిలో భక్తులకు రక్షణగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



### అన్ని దారులు పుష్కరిణి వైపే..

పద్మపుష్కరిణిలో స్నానమాచరించడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. రాత్రి వరకూ దాదాపు లక్షమందికిపైగా భక్తులు తిరుచానూరుకు తరలిరావడంతో ఎటుచూసినా భక్తుల రద్దీనే కనిపించింది.

## ఉదయం: అమ్మవారికి శ్రీవారి సారె



తిరుచానూరు వద్ద సారె ఊరేగింపు..



శ్రీవారి ఆలయంలో

పంచమితీర్థం రోజున తిరుచానూరు పద్మావతిదేవికి శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పరిమళాన్ని విమాన ప్రాకారంలో తెల్లవారు జామున ఊరేగించారు. గర్భాలయంలో శ్రీవారి వక్షఃస్థల లక్ష్మీ అమ్మవారికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. 4.30 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి సారె ఊరేగింపు మొదలైంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఏకాంగులు, అర్చక పరిచారకులు కాలిబాటన అలిపిరికి చేరుకున్నారు. అక్కడ జేఈవో వీరబ్రహ్మంకు అందజేశారు. అక్కడి నుంచి సారె తీసుకుని భారీ ఏనుగు అంబారీ మధ్య కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండ్, లక్ష్మీపురం మీదుగా తిరుచానూరు ముఖద్వారం వద్దనున్న పసుపు మండపానికి 10.15 గంటలకు తీసుకొచ్చారు. సారెకు ప్రత్యేక పూజలు చేశాక టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, సీవీఎస్వో మురళీకృష్ణ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు తిరువీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి.. 10.56 గంటలకు పంచమితీర్థం మండపానికి తీసుకొచ్చారు.

- తిరుమల/తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

## సాయంత్రం: బంగారు పద్మంపై పద్మావతి

చక్రస్నానం అనంతరం అమ్మవారిని పుష్కరిణికి ఎదురుగా ఉన్న గంగుండ్ర మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం శ్రీవారు పంపిన బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. సాయంత్రం 7.30 గంటలకు అమ్మవారు బంగారు పద్మంపై ఆశీనులై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు.





### నేడు: పుష్పయాగం

పద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఏటా బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి పుష్పయాగంలో పాల్గొనవచ్చు. ఈ సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దుచేశారు.

### రాత్రి: ధ్వజావరోహణం

మంగళవారం రాత్రి 10- 11 గంటల మధ్య ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద అర్చకులు ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా అర్చకులు ధ్వజారోహణం రోజున ఎగురవేసిన గజపటాన్ని అవరోహణం చేశారు. ఉత్సవాల నిర్వహణకు ఆహ్వానించిన సకల దేవతలను, అష్టదిక్పాలకులకు బలినివేదన చేసి తిరిగి వారిని యథాస్థానానికి పంపించారు. ఉత్సవాల నిర్వహణలో పాలుపంచుకున్న పాంచరాత్ర ఆగమ పండితులు, అర్చకులను ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి ఆలయ మర్యాదలతో ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టారు. దీంతో ఈ నెల 17న ప్రారంభమై.. తొమ్మిది రోజులు వైభవంగా జరిగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, నరేష్‌కుమార్, శాంతారామ్, జానకిదేవి, రంగశ్రీ, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

## సత్యవేడు రెవెన్యూ డివిజన్ హామీని నెరవేర్చండి సార్

- సీఎంకు ఎమ్మెల్యే ఆదిమూలం విజ్ఞప్తి

సత్యవేడు/పిచ్చాటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హామీని నెరవేర్చాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... 2024 ఏప్రిల్ 20న ఎన్నికల బహిరంగ సభలో సత్యవేడును రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తానని సత్యవేడు టవర్‌క్లాక్ సాక్షిగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం 2024 ఆగస్టు 19న శ్రీసిటీ పర్యటనకు విచ్చేసిన సమయంలో సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సీఎంకు తాను వినతిపత్రం సమర్పించానని చెప్పారు. గత నెల కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ వినతి అందించానన్నారు. సత్యవేడు నియోజకవర్గం తమిళనాడు రాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో పాటు దేశానికి తలమానికంగా ఉన్న శ్రీసిటీలో సుమారు 300 బహుళ జాతి కంపెనీలు, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించిన హీరో, అపోలో, కాప్రికాన్ వంటి బడా కంపెనీలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, వీటన్నింటికి పరిష్కారం చూపాలంటే సత్యవేడు రెవెన్యూ డివిజన్ తప్పనిసరి అని ఎమ్మెల్యే వివరించారు. తన సత్యవేడు రెవెన్యూ డివిజన్ విజ్ఞప్తిని సీఎం పరిశీలించాలని కోరారు.

## స్విమ్స్‌లో హైడిఫినిషన్ టీడీసీఎస్ చికిత్సలు

తిరుపతి(వైద్యం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లోని మానసిక విభాగం ఆధ్వర్యంలో హైడిఫినిషన్ టీడీసీఎస్ ద్వారా అత్యాధునిక వైద్య చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమని డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. మానసిక విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించిన హైడిఫినిషన్ టీడీసీఎస్ చికిత్సలను ఆయన పరిశీలించారు. మెదడు నాడీకణాలపై



రోగులకు హైడిఫినిషన్ చికిత్సలు నిర్వహిస్తున్న డాక్టర్ గణేష్‌కుమార్

తక్కువ మోతాదులో విద్యుత్తు ప్రవాహాన్ని అత్యంత ఖచ్చితమైన మానిటరింగ్‌తో అందించే నాన్-ఇన్‌వేసివ్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ టెక్నిక్‌గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన అత్యాధునిక వైద్య పద్ధతులను రాష్ట్రంలోనే మొదటిసారిగా స్విమ్స్ మానసిక విభాగంలో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇది మానసిక సమస్యలతో బాధపడేవారికి, మానసిక రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. న్యూరాలజీ, ఫిజియోథెరపీ రంగాల్లో కూడా ఈ చికిత్సలు రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ డాక్టర్ రామ్, మానసిక విభాగాధిపతి డాక్టర్ గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా పాపవినాశనం రోడ్డు విస్తరణ పనులు




వేణుగోపాల స్వామి ఆలయం వద్ద సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

- తొలిదశలో ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పాపవినాశనం రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఔటర్‌రింగు రోడ్డు నుంచి ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు నిర్మిస్తున్నారు. టీటీడీ రూ.40 కోట్ల బడ్జెట్‌తో ఔటర్‌రింగు రోడ్డు నుంచి నేపాలి చెక్‌పోస్టు మీదుగా పాపవినాశనం దాకా ఈ పనులు చేపట్టింది. తిరుమలకు వచ్చే భక్తుల్లో సగానికిపైగా పాపవినాశనం, జపాలి ఆంజనేయస్వామి, ఆకాశగంగ, వేణుగోపాల స్వామి ఆలయాలను సందర్శిస్తుంటారు. రెండు వరుసల రోడ్డు మాత్రమే ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తరచూ తలెత్తుతున్నాయి.

**తొలి దశలో** : రింగురోడ్డు నుంచి ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు నిర్మాణంతో పాటు వాహనాలు గోగర్భం డ్యాం మీదుగా వెళ్లే అవసరం లేకుండా ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి క్షేత్రపాలకుని ఆలయం మీదుగా మఠాలు, డిపింగ్‌యార్డు, నేపాలి చెక్‌పోస్టుకు చేరుకునేలా రోడ్డు నిర్మాణం పనులు మొదలుపెట్టారు. పాచికాల్వ బ్రిడ్జి పనులు దాదాపు చివరి దశలో ఉన్నాయి. మఠాల నుంచి నేపాలి చెక్‌పోస్ట్ వరకు నాలుగులైన్ల సీసీ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది. ప్రస్తుతం నేపాలి చెక్‌పోస్టు నుంచి ఆకాశగంగ వరకు రోడ్డు నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. వేణుగోపాల స్వామి ఆలయం నుంచి ఆకాశగంగ వరకు అదనంగా రెండు లైన్ల నిర్మాణం కోసం దట్టమైన అడవిలో పనులు సాగుతున్నాయి. డిసెంబరు 31 నాటికి పనులు పూర్తిచేయాలని టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ప్రణాళికలు రూపొందించుకుంది. ఇక, ఆకాశగంగ నుంచి పాపవినాశనం వరకు ఉన్న రోడ్డు మార్గం ప్రభుత్వ ఫారెస్ట్ పరిధిలో ఉండటంతో నిర్మాణం కోసం ప్రభుత్వానికి టీటీడీ ఇప్పటికే లేఖ రాసింది. అనుమతులు లభించిన వెంటనే రెండవ దశలో ఈ రోడ్డు విస్తరణ పనులు కూడా మొదలుకానున్నాయి.

## డక్కిలి 'విండో'కు పర్సన్ ఇంఛార్జి కమిటీ

తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి సింగిల్‌విండోకు ప్రభుత్వం పర్సన్ ఇంఛార్జి కమిటీని నియమించింది. ఇప్పటి వరకూ అఫిషియల్ పర్సన్ ఇంఛార్జి కమిటీ కొనసాగుతుండగా ప్రభుత్వం దాని స్థానంలో అనధికార పర్సన్ ఇంఛార్జి కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఛైర్మన్‌గా వెలికంటి రమణారెడ్డి, సభ్యులుగా పిల్లి కృష్ణారెడ్డి, మెరిగ వెంకటస్వామిలను నియమించింది. కొత్తగా నియమించిన కమిటీ కాలపరిమితి వచ్చే ఏడాది జనవరి 30 దాకా వుంటుంది. ఆపై గడువు పొడిగించే అవకాశముంది. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు పాలకవర్గం గడువు పొడిగింపు

శ్రీకాళహస్తి సహకార టౌన్ బ్యాంకు పర్సన్ ఇంఛార్జి కమిటీ కాలపరిమితిని మ రో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత కమిటీ కాలపరిమితి ఈనెల 28వ తేదీ నాటికి ముగిసిపోనుంది.దీంతో ఈనెల29వ తేదీ నుంచీ వచ్చే ఏడాది మే నెల 28వ తేదీ వరకూ కమిటీ కాలపరిమితిని పొడిగించింది.

## హింసకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందడుగు వేద్దాం..!

- మహిళల రక్షణకు 100, 181, 1901 హెల్ప్‌లైన్లు

తిరుపతి (రూరల్/విశ్వవిద్యాలయాలు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, రక్షణకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపడుతున్నాయని, తమకున్న హక్కులపై అవగాహన పెంచుకోవాలని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ డే ఫర్ ద ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ అగైనెస్ట్ ఉమెన్‌ని పురస్కరించుకుని జెండర్ సమానత్వంకోసం వర్సిటీ ఉమెన్‌స్టడీస్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పేరూరు పంచాయతీలోని మహిళలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలపై జరిగే హింసను నిర్మూలించడానికి ఐక్యరాజ్యసమితి ప్రత్యేకంగా ఈ దినోత్సవాన్ని ప్రకటించిందని, మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకుని హింసకి వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావాలన్నారు. మౌనాన్ని వీడి మార్పువైపు అడుగులు వేయాలని, పరస్పర సహకారంతో సురక్షిత వాతావరణాన్ని ఏర్పరచుకోవాలన్నారు. ప్రస్తుతడిజిటల్ ప్రపంచంలో మహిళలపై హింస కొత్త రూపాలలో పెరుగుతోందని, మహిళలు ఎదుర్కొంటున్న భౌతిక, మానసిక, ఆర్థిక, సామాజిక, హింస రూపాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ అరాష్‌మెంట్, బెదిరింపులు, సైబర్‌స్టాకింగ్, డీప్‌ఫేక్ వంటి టెక్నాలజీ ఆధారిత హింసకు పాల్పడుతున్నారని, టెక్నాలజీ వినియోగంలో మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల చట్టపరమైన రక్షణ కోసం ప్రభుత్వం 100,181,1091 వంటి హెల్ప్ లైన్ సదుపాయాలను అందుబాటులోకి తెచ్చిందని, వీటిని సద్వినియోగించుకోవాలన్నారు. డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పత్తిపాటి నాగేశ్వరరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రమేష్, వాహిని, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ పద్మావతి, పక్కన ఏపీఎం నాగేశ్వరరావు తదితరులు

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి

## ఇదేం 'చెత్త' పని!



రోడ్డు పక్కన చెత్త పారబోస్తున్న తడ పంచాయతీకి చెందిన ట్రాక్టర్

తడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సేకరించిన చెత్తతో సంపద సృష్టించాలని, తద్వారా పంచాయతీలు ఆర్థిక వనరులు పెంచుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. అంతేకాకుండా గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తోంది. అయితే తడ పంచాయతీ అధికారులకు ఇవేవీ పట్టడంలేదు. పంచాయతీలో సేకరించిన చెత్తను తీసుకెళ్లి బోడిలింగాలపాడు శివాలయానికి సమీపంలో జాతీయ రహదారి పక్కన పోస్తున్నారు. ఆరు నెలల క్రితం కలెక్టర్ ఆ దారిలో వెళ్తూ చెత్త రోడ్డు పక్కన వెయ్యొద్దని ఆదేశించారు. దీంతో రేకులు అడ్డుగా పెట్టి రహదారి పక్కన చెత్త కనిపించకుండా చేశారు. కొన్నాళ్లకు ఆ రేకులు కిందపడిపోయాయి. మళ్లీ తడ, తడకండ్రిగ పంచాయతీల పరిధిలోని చెత్తను జాతీయ రహదారి పక్కన పోస్తున్నారు. తాజాగా మంగళవారం ఉదయం తడ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ రోడ్డుపైనే చెత్తను పారవేసి వెళ్లిపోయింది. కలెక్టర్ ఆదేశించినా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రతి ఎకరాకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం



తెలుగుగంగ కాలువ వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు రామకృష్ణ, సునీల్‌కుమార్, విజయశ్రీ

బాలాయపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఎకరాకు సాగునీరు అందించి పంటలను పండించేలా ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని ఊట్లపల్లి సమీపంలో ఉన్న తెలుగుగంగ 5వ బ్రాంచ్ కెనాల్ వద్ద పూజలు నిర్వహించి మూడు నియోజకవర్గాలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుగంగ నీటిని విడుదల చేయడం ద్వారా మూడు నియోజకవర్గాల్లోని రైతాంగానికి సాగునీటి భరోసా లభిస్తుందన్నారు. ప్రస్తుతం 15వేల క్యూసెక్కుల నీటిని తెలుగుగంగ కాలువల ద్వారా విడుదల చేయడం జరిగిందన్నారు. రైతు సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మస్తాన్ నాయుడు, సీసీ నాయుడు, వెంకటకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయండి



ఏఐసీసీ పరిశీలకురాలు సుధారామ కృష్ణన్‌తో కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, డీసీసీ అధ్యక్షుడు బాలగురువం బాబు తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఏఐసీసీ పరిశీలకురాలు సుధారామ కృష్ణన్ అన్నారు. మంగళవారం సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు నేతలు, కార్యకర్తలు కలిసి పనిచేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో పర్యటించి కార్యకర్తల సూచనలు, సలహాలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడి నియామకంపై కార్యకర్తల అభిప్రాయ సేకరణ దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, జిల్లా అధ్యక్షుడు బాలగురువం బాబు, నాయకులు వెంకటాచలపతి, హరికృష్ణ, బద్దెపూడి రాజారెడ్డి, దేవదానం, వెంకటరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి వెంకట నాగపవన్ కుమార్

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరిగే భౌతిక, మానసిక, ఆర్థిక, లైంగిక హింసలను అరికట్టి సమాజంలో చైతన్యం పెంపొందించడమే అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవ ప్రధాన ఉద్దేశమన్నారు. మహిళలకు భద్రత కల్పించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, అరవ పార్వతయ్య, మెహబూబ్ బాషా, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రైతన్న సమస్యలను విస్మరిస్తే ఉపేక్షించం: కురుగొండ్ల

వెంకటగిరి, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): రైతన్న సమస్యలను విస్మరిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులను హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని కలవలపూడి పంచాయతీ జీకేపల్లిలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రైతుల ఇళ్ల వద్దకు, పొలాల వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. రైతుల ఇళ్ల వద్దకు వెళ్ళి కరపత్రాలు అందజేసి ప్రభుత్వ పతకాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలన్నీ అమలు

వెంకటగిరి, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు వెంకటగిరిలో నిర్వహించిన జాబ్‌మేళాల ద్వారా 350 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో 20 వేల ఉద్యోగాలు ఇవ్వడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొందన్నారు.

## పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రత అంశంపై అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి చైతన్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం మన్నెముత్తేరి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్న కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మన్నెముత్తేరి, ఇసుకమిట్ట, కోళ్లమిట్ట, రాఘవయ్యపేట, బాపూజీకాలనీ, కసారెడ్డిపాలెం, డేగలపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని రైతులు, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

## అందుబాటులో యూరియా

వెంకటగిరి టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యూరియా అందుబాటులో ఉందని, రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని ఏడీఏ అనసూయ అన్నారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో రైతులందరికీ అవసరమైన యూరియా అందుబాటులో ఉందన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొస్తే రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేస్తామని చెప్పారు.



బురదమయంగా ఉన్న నాయుడుపేట - పాత వెంకటగిరి రోడ్డు - గుంతలమయంగా మారిన దారి - బురద తగ్గడంతో దుమ్ము

# వానొస్తే బురద... ఎండొస్తే దుమ్ము

- ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు
- మున్సిపల్ నిధులు రూ.10 లక్షలతో మరమ్మతులు
- వారం రోజులకే అధ్వానంగా మారిన రహదారి

నాయుడుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - పాత వెంకటగిరి రోడ్డు వానొస్తే బురద... ఎండొస్తే దుమ్ముతో వాహనదారులు, పాదచారులకు నరకం చూపుతోంది. నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు, పాఠశాలలకు వెళ్లే వాహనాల రాకపోకలతో ఈ దారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారి వాహనాలు, పాదచారులు వెళ్లలేని పరిస్థితులు నెలకొంది. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఈ రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నప్పటికీ మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.10 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆ పనులు చేసిన ఐదు రోజులకే మళ్లీ రోడ్డు అధ్వానంగా మారి తిరిగి యథాస్థితికి చేరుకుంది. మొక్కుబడిగా, నాణ్యత లేకుండా పనులు చేయడంతోనే రోడ్డు వారం రోజులకే దెబ్బతిందని, రూ.10 లక్షలు వృథా అయ్యాయని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున రోడ్డు బురదమయంగా మారి ప్రయాణికులు అవస్థలు పడుతుంటే అధికారులకు పట్టడంలేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాల్సిన అవసరం ఉంది.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం: పాశిం



రైతులకు కరపత్రాలను అందజేసి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్నదాతలకు అండగా నిలిచేందుకు వారికి అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. పంటల సాగుకు చేయూత అందించేందుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో రెండో విడత జమ చేయడం జరిగిందన్నారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలుస్తోందన్నారు. సాగుకు అవసరమైన యూరియా కొరత లేకుండా ప్రతిరైతుకూ ఎకరానికి మూడు బస్తాలు అందించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే రాయితీతో డ్రోన్‌లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులు, అమరేంద్ర, సునీల్, వ్యవసాయశాఖ ఏడీ గోపినాయక్, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి అండగా ప్రభుత్వం: విజయశ్రీ



రైతులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

పెళ్లకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం రైతాంగానికి అండగా ఉంటోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని రావులపాడులో గ్రామంలో చిల్లకూరు సొసైటీ చైర్మన్ కేవీ నాయుడు ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంచ సూత్రాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు సాగునీటి యాజమాన్యం, రాయితీతో వ్యవసాయ పనిముట్లు, విత్తనం నాటిన నాటి నుంచి నూర్పిడి వరకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జున సాగర్, ఏవో విజయభారతి, ఎంపీడీవో ప్రమీలారాణి, డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, నాయకులు పేరం రమేష్ నాయుడు, కందమూడి శివకుమార్, చైతన్యకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, నరేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవాజ్ ప్లస్ సర్వేలో నమోదు కావాలి

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాలు కావాల్సిన వారు ఆవాజ్ ప్లస్ సర్వేలో నమోదు అయి ఉండాలని గృహనిర్మాణశాఖ డీఈ షబ్బీర్, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవాజ్ ప్లస్ పథకంపై సచివాలయ ఉద్యోగులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష జరిపారు. ఆవాజ్ ప్లస్ పథకంలో నమోదయ్యేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరు గడువని చెప్పారు. ఇప్పటి వరకు మండలంలోని 21 పంచాయతీల్లో సర్వే జరిపి అర్హులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇంకా అర్హులైన వారు ఉంటే పక్కాగృహాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ భాస్కర్ రావు, టీడీపీ నేతలు జలీల్ అహ్మద్, వెంకటకృష్ణారెడ్డి, మస్తాన్‌బాషా, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ అనురాధ, పక్కన ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరాలన్న, ఆర్థికంగా ఎదగాలన్న ప్రాథమిక దశ నుంచే పట్టుదలతో చదవాలని ప్రముఖ వైద్యురాలు అనురాధ అన్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనురాధ మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లలకు విద్య ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. అనంతరం సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వేలం పాటల వాయిదా

కోట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపాలు, లైటింగ్, షామియానా నిర్వహణకు దేవదాయశాఖ ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. ఒక్కరు మాత్రమే ముందుకొచ్చి వేలంలో పాల్గొన్నారు. దీంతో అధికారులు వేలం పాటలను వాయిదా వేశారు.

## రైతాంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం: సీపీఐ

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మహిళా నాయకురాలు చెంచమ్మ అధ్యక్షతన నియోజకవర్గ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కుల, మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నరేంద్ర మోదీ ఒకటి కూడా నెరవేర్చకపోవడం దారుణమన్నారు. రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు మోదుగుల పార్థసారధి, సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణ, నాగేంద్ర, శ్రీనివాసులు, కుమార్, నాగేంద్ర, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## తేనెటీగల దాడిలో హౌసింగ్ అధికారులకు గాయాలు

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తేనెటీగలు దాడి చేయడంతో హౌసింగ్ అధికారులు గాయపడిన ఘటన కోట మండలం కొండుగుంట వద్ద మంగళవారం జరిగింది. హౌసింగ్ డీఈ షబ్బీర్, ఏఈ భాస్కర్‌రావు లేఅవుట్‌లను పరిశీలించేందుకు కొండుగుంట నర్సరీ వద్దకు వెళ్లారు. అక్కడ స్థల పరిశీలన చేస్తుండగా కొండ తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో అధికారులు పరుగులు తీశారు. తీవ్రంగా గాయపడిన అధికారులను స్థానికులు చిట్టెడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తీసుకెళ్లారు.

## మంత్రి సత్యకుమార్‌కు సన్మానం



మంత్రి సత్యకుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు విజయభాస్కర్, చెంచుకృష్ణయ్య

నాయుడుపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను బీజేపీ ఎస్సీసెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బొల్లకాయల విజయభాస్కర్, మాజీ జిల్లా కార్యదర్శి ఆశ చెంచుకృష్ణయ్య సన్మానించారు. మంగళవారం ఉమ్మడి నెల్లూరుజిల్లా మనుబోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి సత్యకుమార్ ప్రారంభించిన సందర్భంగా ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆరూరు సుధాకర్, యనమల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ఢీకొని వలస కూలీ మృతి

వాకాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొనడంతో వలస కూలీ మృతి చెందిన ఘటనల మండలంలోని సిద్ధిగుంటపాళెం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఫజిల్‌పూర్ నివాసి దులాల్ సర్దార్(65) వరినాట్లు వేసేందుకు నెల రోజులక్రితం నుంచి సిద్ధిగుంటపాళెం గ్రామానికి వచ్చాడు. అక్కడే ఓ గోదాములో అద్దెకుంటూ కూలి పనులకు వెళ్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకొని వస్తుండగా బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన దులాల్ సర్దార్ అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగబాబు తెలిపారు.

## వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు నెంబరు ప్లేటు లేని ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన మంగళవారం రాత్రి సూళ్లూరుపేట పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సూళ్లూరు బొగ్గుల కాలనీకి చెందిన మన్నారు మంగమ్మ బాపూజీ కాలనీలో ఉన్న తన కుమార్తె ఇంటికెళ్లి తిరిగి వస్తుండగా విద్యుత్‌శాఖ ఈఆర్ కార్యాలయం వద్ద ఇద్దరు యువకులు మోటారు సైకిల్ వేగంగా వచ్చి మంగమ్మ మెడలోని 3 సవర్ల బంగారు గొలుసు లాక్కొని వెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే స్పందించి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. నమోదు దర్యాప్తు చేపట్టారు.

## కుష్టువ్యాధి నిర్ధారణ పరీక్షలు

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేగనూరు, కొండాగుంట, వెందోడు, చెన్నూరు సచివాలయాల పరిధిలో మంగళవారం చెన్నూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టునిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజేంద్రప్రసాద్, మస్తానయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాగు భూములకే యూరియా

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భూములను సాగుచేసే రైతులకే యూరియా అందజేస్తామని దామానెల్లూరు సొసైటీ డైరెక్టర్ పుట్టు విజయరాఘవులు స్పష్టం చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'యూరియా.. ఈ తీరు బాగలేదయా.. సాగులేని భూములకు గుర్తింపు కార్డులా?' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో దామానెల్లూరు సొసైటీ డైరెక్టర్, సీఈవో రామయ్య స్పందించారు. భూములను సాగుచేసే రైతులందరికీ ఇబ్బంది లేకుండా యూరియా అందజేస్తున్నామని చెప్పారు. కొందరు వైసీపీ నాయకులు కావాలనే ప్రభుత్వంపై బురదజల్లేందుకు సాగులో లేని భూములకు వ్యవసాయాధికారుల నుంచి గుర్తింపు కార్డులు తెచ్చుకుని యూరియా కొరత ఉందని రైతులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతికాదని, సాగుచేసే రైతులందరికీ యూరియా అందజేస్తామని సొసైటీ డైరెక్టర్ తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాలు లేనివారికి కూడా యూరియా ఇస్తామన్నారు. వ్యవసాయ అధికారులు కూడా గుర్తింపు కార్డులు ఇచ్చే సమయంలో ఆ సర్వే నెంబరు సాగులో ఉందా లేదా నిర్ధారించుకోవాలని సూచించారు.

## డంపింగ్ యార్డు కోసం స్థల పరిశీలన

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డు సమస్య మళ్లీ మొదటకొచ్చింది. గతంలో కొణ్ణంబట్టు రెవెన్యూ పరిధిలో డంపింగ్ యార్డు కోసం పది ఎకరాల స్థలాన్ని కేటాయించారు. గ్రామస్థుల నుంచి వ్యతిరేకత రావడంతో పాటు సమస్యలు తలెత్తడంతో అక్కడ చెత్తను వేయలేదు. అప్పటి నుంచి ప్రస్తుతం రీసైక్లింగ్ చేస్తున్న డంపింగ్ యార్డు వద్దే చెత్తను వేస్తున్నారు. తాజాగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి డంపింగ్ యార్డు స్థలం కోసం మంగళంపాడు చెరువు పక్కన సర్వే నెంబరు 2లో అనాదీనం భూములను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు కొందరు అక్కడికి చేరుకుని అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. చేసేదేమీ లేక తహసీల్దార్ అక్కడికి వచ్చిన గ్రామస్థులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసి అక్కడ నుంచి వెనుతిరిగి వచ్చారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



దక్షిణపాలం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గూడలి పంచాయతీ దక్షిణ పాలెం గ్రామంలో రైతన్నా నీకోసం కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు, సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, రైతు కార్యదర్శి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మైనార్టీ సెల్ నాయకులు మస్తాన్‌బాషా, పోలమ్మ, యువత అధ్యక్షుడు సురేష్‌గౌడ్, సుబ్రహ్మణ్యం యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

## సైన్స్ టాలెంట్ సెర్చ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జేవీవీ సభ్యులు, ఉపాధ్యాయులు

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన గూడూరు మండలం చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు జేవీవీ సభ్యులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జేవీవీ సభ్యులు మాట్లాడుతూ జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని సైన్స్‌సెంటర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌టాలెంట్ సెర్చ్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండలంలోని చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు తరుణ్‌కుమార్, ఆదిత్య, వహీద్‌అహ్మద్ ప్రతిభచాటి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు, చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, ప్రభాకర్, హెచ్‌ఎం బాలనాగమ్మ, ఉపాధ్యాయులు వీరాస్వామి, చంద్రశ్రీ, లోకేశ్వరి, శ్రీవాణి, సునీత పాల్గొన్నారు.

## హింసలేని సమాజం కావాలి



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మహిళల మానవహారం

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హింసలేని సమాజం కోసం మహిలందరూ సమైక్యంగా పోరాడాలని ఏపీఎం ప్రసన్నకుమారి అన్నారు. అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వెలుగు సభ్యులకు, లీడర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై హింస ఒక సాధారణ అంశంగా రూపు దాల్చడం ఆందోళనకరమన్నారు. ఎంపీడీవో మురళీకృష్ణ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టాలని అన్నారు. తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీసీలు సుధాకర్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో ఉంటా: ఆదిమూలం


ముంపు బాధితులకు గృహోపకరణాల పంపిణీ

కేవీబీపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. మంగళవారం మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా వెలుగు కార్యాలయాన్ని తనిఖీ చేసి మహిళా భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని ఏఈఈ నాగేశ్వరావును కోరారు. తరువాత రైతు సేవా కేంద్రానికి వెళ్లి యూరియా సరఫరాపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేవీబీపురం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు, తహసీల్దార్ రోశయ్య, ఎంపీడీవో మాలతి, ఎంఈవో లక్ష్మీపతి తదితరులతో కలిసి భోజనం చేశారు. అనంతరం కళత్తూరుకు చేరుకుని ముంపు బాధితులకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ఎల్ఈడీ బల్బులు, దుప్పట్లు పంపిణీ చేశారు. పాతపాళెం అరుంధతివాడ, కళత్తూరులో 670 ఎకరాలు నష్టం వాటిల్లినట్లు అంచనాలు పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ బాలాజీ, రమేష్, శివరాం తదితరులు పాల్గొన్నారు. కళత్తూరు దళితవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని విజయపురం మండలానికి చెందిన మహేశర్మ, చంద్రయ్య పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు రేవతి, ఏకుమళై, ఈశ్వరి, శివరంజని తదితరులు పాల్గొన్నారు.

## సరుకులు సక్రమంగా అందడం లేదు

● సెక్టార్ సమావేశంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు

సత్యవేడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకుపౌష్టికాహా రానికి సంబంధించిన సరకులు అందడం సక్రమంగా లేదని సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరోపించారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ చెంచులక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సెక్టార్ సమావేశంలో మండల అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకురాలు నిర్మల మాట్లాడుతూ... ప్రతినెలా ఇండెంట్ పంపుతున్నా ప్రయోజనం లేకపోయిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు, గర్భిణులకు, బాలింతల సంఖ్యకు తగ్గట్టు సరుకులు రావడం లేదన్నారు. అయితే పాలు, కోడిగుడ్లు మాత్రమే సక్రమంగా అందుతున్నాయన్నారు. బియ్యానికి సంబంధించి రేషన్ డీలర్లకు వద్దకు వెళ్లితే వేలిముద్రలు తీసుకుని ఇండెంట్ మేరకు సరుకులు ఇవ్వడం లేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు భువన, గౌరి, నాగరాజు, భారతి తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం మునెయ్య మాట్లాడుతూ పని చేసే ప్రదేశంలో వివక్షకు గు రిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిసెంబరు 23వరకు జెండర్ ఆధారిత హింసపై అన్ని సంఘాల్లో కచ్చితంగా అజెండా పెట్టి చర్చించాలని ఆదేశించారు. సీసీ వెంకటరత్నం, మండల సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

**నారాయణవనం (ఆంధ్రజ్యోతి):** అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినాన్ని పురష్కరించుకుని మార్పు కోసం ముందడుగు ఉద్యమంతో ప్రతి మహిళా చైతన్యంతో లింగ వివక్షతను నిర్మూలించాలని ఎంపీఎం ధనంజయరెడ్డి పిలుపునిచ్చారు. నారాయణవనం మహిళా సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం మహిళా సదస్సు జరిగింది. ఐటీడీఎస్ సూపర్‌వైజర్ బేబీరాణి, ఏపీఎం డైరీ సుదర్శన్ రాజు, స్త్రీనిధి మేనేజర్ అదిల్‌భాషా, సీసీ నాగేంద్రరావు, అరుణ్‌కుమార్, నిమ్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

**రేణిగుంట (ఆంధ్రజ్యోతి):** మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా వెలుగు కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, డీపీఎం విజయ, ఏపీఎం కోమలాదేవి, సీసీలు, మండల సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## కుక్కంబాకం కొత్త చెరువు తూముకు మళ్లీ బొగడ


కోసుకుపోయిన కట్ట - బొగడ కారణంగా పొలాల్లో చేరిన నీరు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం కొత్తచెరువు తూము దగ్గర మళ్లీ బొగడ పడింది. దీంతో చెరువులోని నీరు లీకై పొలాలపై పారుతోంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కొత్త చెరువు కలుజు దగ్గర పొగడ పడింది. అప్పట్లో ఇసుక బస్తాలు వేసి కట్టడి చేశారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి చెరువుకు నీరు చేరుతుండడంతో కలుజు దగ్గర మళ్లీ బొగడ ఏర్పడింది. ప్రస్తుతం ఇసుక బస్తాలు వేసిన కట్ట నుంచి నీరు పారుతోంది. సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# పుత్తూరు వార్తలు

## రైతులు ఆర్థికంగా ఎదగాలి: ఎమ్మెల్యే భాను


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ చేదోడుగా ఉంటుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. మంగళవారం మండలంలోని టీసీ అగ్రహారంలో అన్నధాత సుఖీభవ, రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా రైతులను కలసి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి రైతు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీసీ అగ్రహారం పరిధిలోని భూముల్లో జింక్ సాంద్రత తక్కువగా ఉందని అధికారులు గుర్తించడంతో రైతులకు జింక్ సల్ఫేట్ ఉచితంగా అందజేశామన్నారు. పాడి పరిశ్రమపై ఎక్కువగా ఆధారపడి ఉన్నారని మినీ గోకులాలు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. జట్పీటీసీ సభ్యులు మురళీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు దాముయాదవ్, ధనంజయులు నాయుడు, వెంకటయ్య, శివ, రవిరెడ్డి, దాము, కుమార్, మునిశేఖర్, హేమావతి, లక్ష్మీప్రసన్న, ఏవో విజయ్‌కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

## హక్కులను మహిళలు తెలుసుకోవాలి



మహిళలకు సూచనలిస్తున్న న్యాయవాది అనురాగిణి

పుత్తూరు అర్బన్, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): డిజిటల్ యుగంలో మహిళలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవాలని పుత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సురేష్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల సంస్థ ఆధ్వర్యంలో కామరాజనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ.. నాగరిక సమాజంలో మహిళలపై హింస జరుగుతుండటం దారుణమన్నారు. గృహహింసా చట్టం, కట్న దురాచార చట్టం, భ్రూణ హత్యలు తదితర అంశాలపై న్యాయవాది అనురాగిణి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

## నేడు అయ్యప్ప స్వామి 49వ లక్ష బిల్వార్చన

● ఎమ్మెల్యేను ఆహ్వానించిన ఆలయ పాలకమండలి



పుత్తూరు అర్బన్, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వరాలయ ప్రాంగణంలో కొలువై ఉన్న అయ్యప్ప ఆలయంలో 49వ లఘు లక్ష బిల్వార్చన, జ్యోతి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను ఆలయ పాలకమండలి అధ్యక్షుడు దిలీప్ ఆహ్వానించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ఆలయ పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి
# సత్యవేడు

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కేవీబీపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఎగువపుత్తూరుకు చెందిన శివకుమార్ గత కొంత కాలంగా మూత్రాపిండాలు దెబ్బతినడంతో వైద్యం పొందుతున్నాడు. బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.97,180 చెక్కును మంగళవారం ఎమ్మెల్యే అందించారు.

## పళ్లికొండేశ్వరాలయంలో తరచూ కనిపించని అర్చకులు!

భక్తులకు లభించని వాల్మీకేశ్వరస్వామి సమేత మరగదాంబిక, దక్షిణామూర్తుల హారతి


పూజారులు లేక ఖాళీగా వాల్మీకేశ్వర, మరగదాంబిక, దక్షిణామూర్తి సన్నిధులు

నాగలాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయంలో అర్చకులు అప్పుడప్పుడు కనిపించకుండా పోతున్నారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులకు హారతి కరువవుతోంది. జిల్లాలోని ప్రముఖ శివాలయాల్లో పళ్లికొండేశ్వర ఆలయం ఒకటి. ఈ ఆలయం ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడంతో వందల మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. ఈ ఆలయంలో పళ్లికొండేశ్వరుడి సన్నిధి సహా మూలస్థానం సన్నిధిలో మరగదాంబిక, వాల్మీకేశ్వరుడి, దాంపత్య దక్షిణామూర్తి సన్నిధులున్నాయి. ఆలయంలో ఆరుగురు అర్చకులు ఉన్నారు. ఇందులో పళ్లికొండేశ్వరుడి సన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకుడు ఉంటారు. మిగిలిన మూడు సన్నిధుల్లో ముగ్గురు, మరో ఇద్దరు రోజువారి వేతనాల కింద అర్చకత్వం నిర్వహిస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా ఉదయం వేళలో ఈ సన్నిధానాల్లో అర్చకులు ఏదో ఒక సాకుతో బయటికి వెళ్లిపోతున్నారు. ఒక్కోసారి ఈ మూడు సన్నిధానాలకు ఒకే ఒక్క అర్చకుడు మాత్రమే ఉంటున్నారు. దీంతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు కనీస హారతి కరువైపోతోంది. ఒకరిద్దరు అర్చకులైతే... విధుల్లో ఉన్నా భక్తులకు హారతి కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆలయ ఈవో లతని వివరణ కోరగా... అర్చకులతో సమావేశం నిర్వహించి దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## గుంతలు తేలిన రోడ్డు

ప్రమాదాల నిలయంగా రాజీవ్‌నగర్ మార్గం


బంగారమ్మ కాలనీ వద్ద అధ్వానంగా ఉన్న రాజీవ్‌నగర్‌కు వెళ్లే రోడ్డు

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి రాజీవ్‌నగర్‌కు వెళ్లే మార్గం పలుచోట్ల గుంతలు తేలడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. మున్సిపల్ కార్యాలయం నుంచి పిచ్చాటూరు వరకు రహదారి ఉంది. పట్టణం నుంచి రాజీవ్‌నగర్‌కు ఇదే ప్రధాన రహదారి. నిత్యం పెద్దఎత్తున ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ధర్మరాజ స్వామి ఆలయం వెనుక, బంగారమ్మ కాలనీ, సమీపంలో నాగాలమ్మ పుట్ట ప్రాంతంలో రహదారి అధ్వానంగా మారింది. ఏటా మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్‌సీపీ స్కూల్ వరకు రోడ్డు దెబ్బతింటోంది. మరమ్మతులు చేపడు తున్న ప్పటికీ వర్షాకాలంలో తిరిగి యథావిధిగా అధ్వానంగా మారుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రాజీవ్‌నగర్ మార్గంలో గుంతల రోడ్డుకు మరమ్మతులు చేశారు. అయితే ఆరు నెలలకే మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం బంగారమ్మ కాలనీ వద్ద రోడ్డు భారీగా దెబ్బతింది. ఈ మార్గంలో అధిక సంఖ్యలో వహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల నెల రోజుల వ్యవధిలో పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి గాయపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

## రైతన్నకు అండగా చంద్రన్న


రంగినేని చెంచయ్య ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం


రామిరెడ్డిపాళెంలో నందకిషోర్ రెడ్డి, కొల్లడంలో ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం

శ్రీకాళహస్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతన్నకు సీఎం చంద్రబాబు అండగా అండగా ఉంటారని శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు అన్నారు. మండలంలోని ఎగువీధి పంచాయతీలో మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ పథకం ప్రయోజనాన్ని వివరించారు. ఇక రానున్న రోజుల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ బత్తిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్, జగన్నాథం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి):** మండలం లోని కాంబాకం పంచాయతీ రామిరెడ్డిపాళెంలో జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి ఏవో ప్రవీణ, వెటర్నరీ వైద్యురాలు గౌరి, సింగిల్‌విండో చైర్మన్ ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులు జమ కాని రైతులు సచివాలయంలో గ్రీవెన్స్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

**సత్యవేడు (ఆంధ్రజ్యోతి):** రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని సత్యవేడు మండల టీడీపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొల్లడంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఆక్రమణలో చెరువు వరవ కాలువ


మఠం చెరువు వరవ కాలువ ఆక్రమణతో పొలంలో చేరిన నీరు

కేవీబీపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మఠం గ్రామంలోని వరక కాలువ ఆక్రమిండంతో చెరువుకు నీరు చేరడం లేదు. ఆ నీళ్లన్నీ రైతుల పొలాలపై పారుతున్నాయి. దీంతో పంట దెబ్బతింటోంది. ఆక్రమణలపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ ఆక్రమణలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

డీఎస్పీ హెచ్చరిక

వరదయ్యపాళెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీసిటీ డీఎస్పీ బి.వి.శ్రీనివాసులు హెచ్చరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో శ్రీసిటీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ పి.అరుణ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో 3 డ్రంకెన్ డ్రైవ్ విత్ ఎఫ్ఐఆర్, 8 డ్రంకెన్ డ్రైవ్, 25 బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన నిందితులను మంగళవారం సత్యవేడు జడ్జి ముందు హాజరు పరిచారు. ఈ కేసులో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి తలా రూ.10 వేలు, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ పట్టుబడిన వారికి తలా రూ. వెయ్యి జరిమానా సత్యవేడు జడ్జి విధించినట్లు తెలిపారు.

## జింగిలిపాలెం దళితులకు భూ పంపిణీ చేయాలి

సీపీఎం డిమాండ్


సాగు భూమిలో ఎర్రజెండాలు పాతుతున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జింగిలిపాలెం దళితులకు భూములు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో దళితులతో కలిసి ప్రభుత్వ భూమిలో జెండాలు నాటారు. నారాయణపురం సర్వే నెం. 465లో ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమిని గత పదిహేనేళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్నారని, పట్టాలివ్వడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. స్థానికేతరులకు ఇచ్చిన పట్టాలను తక్షణమే రద్దు చేయకపోతే భూ పోరాటం తప్పదని హెచ్చరించారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, స్థానికులు ఈశ్వర్, మోహన్ కృష్ణ, శంకరయ్య, హరీష్, వెంకట్రామయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ బ్యాంకుకు సౌర విద్యుత్ ఏర్పాటు


తీర్మానం ప్రవేశపెడుతున్న చైర్మన్ ఖాదర్

శ్రీకాళహస్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సహకార టౌన్‌బ్యాంక్ భవనానికి సౌర విద్యుత్ ఏర్పాటు చేసేలా కమిటీ తీర్మానం చేసింది. మంగళవారం బ్యాంకులో కమిటీ సమావేశం జరిగింది. ఇందులో భాగంగా విద్యుత్ ఛార్జీల భారం తగ్గించేందుకు సోలార్ సిస్టం అమర్చేలా ప్రతిపాదనను ఆమోదించారు. చైర్మన్ ఖాదర్‌బాషా, వైస్ చైర్మన్ గోవర్ధన్, సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి


మల్లైయన్ (ఫైల్ ఫొటో)

సత్యవేడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. మండలంలోని శిరుణంబూదూరు గ్రామానికి చెందిన మల్లైయన్(38) ఉదయం 11 గంటల సమయంలో ఇనుప గ్రిల్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంట్లో విద్యుత్ వైర్లు ఇనుప గ్రిల్ మీదుగా వెళ్తుండడం, ఆ రాపిడికి వైరుపైనున్న పూత కరిగి లోపలున్న తీగలు గ్రిల్‌కు తగడంతో విద్యుత్ సరఫరా అయ్యి ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించడంతో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

### నేడు పూడిలో రైతన్నా మీకోసం

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం పూడి గ్రామంలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు తెలిపారు. మండంలోని పూడి గ్రామంలో ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే సుధీర్ హాజరై రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కూటమి నేతలు, కార్యకర్తలు, రైతులు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

### తెలుగు మెటీరియల్ పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల కోసం ఈ ఏడాదిలో స్వల్ప మార్పులతో మారిన తెలుగు ప్రశ్నాపత్రం ఆధారంగా రూపొందించిన మెటీరియల్‌ను హెచ్ఎం వాణి పంపిణీ చేశారు. తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి పాల్గొన్నారు.

### ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని కాటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో 9 పాఠశాలల హెచ్ఎంలతో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సృజనాత్మకతో పాటు సామర్థ్యాలకు అనుగుణంగా బోధించాలని సూచించారు. ఫౌండేషన్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు.

### శ్మశాన వాటికకు దారి ఏర్పాటు

రేణిగుంట నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన మొలగమూడి శ్మశాన వాటిక దారిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మొలగమూడిలో తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డి సిబ్బంది ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. అనంతరం దారి పక్కనున్న పట్టాదారులతో మాట్లాడి మరో 10 అడుగులు కలుపుకొని ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డును ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

### ఆక్రమణల తొలగింపు...

ఎల్లమండ్యం పంచాయతీ పరిధిలోని కొత్తపాళెం సర్వేనెం.89 లో ఉన్న కాలువ భూమిని పక్కనే ఉన్న మరో పట్టా భూమి సర్వే నెంబర్‌తో కలుపుకుని లేఅవుట్ వేసిన విషయాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. తహసీల్దార్ సిబ్బందితో చేరుకుని ఆక్రమణకు గురైన భూమిలో కాలువ తవ్వించారు. విచారణ అనంతరం ఆక్రమణదారులపై కేసు నమోదు చేయిస్తామని చెప్పారు.

### సీఆర్ఎస్‌లో మాక్ డ్రిల్

రేణిగుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తూ క్యారేజ్ రిపేర్ షాప్‌లో ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం సీఆర్ఎస్‌లో చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ శ్రీనివాస్, డిప్యూటీ సీఎంఈ ప్రమోద్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సమయంలో అనుకోని ప్రమాదం జరిగినప్పుడు చేపట్టాల్సిన ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించారు. సేఫ్టీ ఆఫీసర్ హిమసాగర్, సీఆర్ఎస్ అధికారులు సివిల్ డిఫెన్స్ టీం, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

### టీబీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకుల పంపిణీ

రేణిగుంట నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులను జిల్లా వైద్య అధికారి బాలకృష్ణ నాయక్ అందజేశారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు బియ్యం, తదితర నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ చక్రపాణి, టీబీ సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు తదితరులు పాల్గొన్నారు.